

● పున్నమి వెలుగు



సముద్రానికి హారతి ఇస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర




ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం



యనమలకుదురు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న యువతులు ↑

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద పుణ్యస్నానాలు ↓



కార్తీక పౌర్ణమి బుధవారం భక్తి దేదీప్యమానమైంది. కృష్ణాతీరం కాంతివంతమై ప్రకాశించింది. శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలతో అంతటా పంచాక్షరీ మంత్రం మార్మోగింది. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులతో కృష్ణాతీర ఘాట్లు, సముద్రతీరాలు కిటకిటలాడగా, శివాలయాలు కళకళలాడాయి. ఇంద్రకీలాద్రిపై గిరిప్రదక్షిణ కనులపండువగా జరగ్గా, సాయంసంధ్య వేళ నిర్వహించిన కోటి దీపోత్సవంతో కార్తీక కాంతులు మిన్నంటాయి. 6

సంక్రాంతికి సీ ప్లేన్

రూ.20 కోట్లతో వాటర్ డ్రోమ్ నిర్మాణం.. డిసెంబరుకు పూర్తి

- విజయవాడ నుంచి శ్రీశైలం మాత్రమే కాకుండా..
- విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-విశాఖపట్నానికి కూడా..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతికి విజయవాడ నుంచి సీ ప్లేన్ సేవలు ప్రారంభం కానున్నాయి. విజయవాడ నుంచి శ్రీశైలంతో పాటు విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-విశాఖ పట్నం మధ్య కూడా ఈ సర్వీసులు మిగతా 6లో..

● బులెట్‌పై బోడె



కంకిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిత్యం అనుచరులు, కార్యకర్తలతో బిజీబిజీగా కనిపించే పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం మాత్రం సాధారణ పౌరుడిలా కలియతిరిగారు. బులెట్‌పై కంకిపాడులో పర్యటించారు. బ్యాంక్ కాలనీ, వాణినగర్‌లోని రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించారు. కంకిపాడు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలు ఎన్టీఆర్ జిల్లాలో కలుస్తున్నాయా? పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాకే పరిమితమవుతుందా? కైకలూరును తిరిగి కృష్ణా జిల్లాలోకి తీసుకురానున్నారా?.. అంటే దాదాపు అవుననే సమాధానమే వస్తుంది. జిల్లాల పునర్విభజనకు సంబంధించి మంత్రుల బృందం బుధవారం అమరావతిలో నిర్వహించిన కీలక సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చినట్టు తెలిసింది.

● పునర్విభజన.. పునరుద్ధరణ

మంత్రుల సమావేశంలో కీలక అంశాలపై చర్చ

ఎన్టీఆర్ జిల్లాలోకి గన్నవరం, నూజివీడు వచ్చే చాన్స్

- నూజివీడు రెవెన్యూ డివిజన్ పునరుద్ధరించే అవకాశం
- తిరువూరు రెవెన్యూ డివిజన్ రద్దు చేయవచ్చు
- కైకలూరు నియోజకవర్గం తిరిగి కృష్ణాలో కలుపుతారా?
- పెనమలూరు నియోజకవర్గం కృష్ణాలోనే కొనసాగించే ఆస్కారం
- గ్రేటర్ విజయవాడలో ఉన్న పెనమలూరు పరిస్థితి ఏమిటి?

● క్యాబినెట్ ఆమోదం తర్వాతే అన్ని అంశాలూ కొలిక్కి..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు సమయంలో.. గన్నవరం, పెనమలూరుతో పాటు ఏలూరు జిల్లాలో కలిపిన నూజివీడును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ బాగా వినిపించింది. కాగా, అమరావతిలోని సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన మంత్రుల సమావేశంలో గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల విలీన అంశాలు చర్చకు వచ్చాయి. దీనికి సంబంధించి క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాజా చర్చల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా భౌగోళిక స్వరూపం మార్పు చెందే అవకాశం ఉంది. గన్నవరం, పెనమలూరు, నూజివీడు నియోజకవర్గాలు మూడూ ఎన్టీఆర్ జిల్లాకు దగ్గరగా ఉంటాయి. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ప్రధాన మండలాల్లో ఉన్న గ్రామాలు విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలోనివి. దీంతో గన్నవరం, పెనమలూరును ఖాయంగా విలీనం చేస్తారని ప్రజలు భావించారు.

విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి గన్నవరం, మైలవరం?

గన్నవరం, మైలవరం నియోజకవర్గాలను పూర్తిగా విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది. మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, జి. కొండూరు, మైలవరం మండలాలు ప్రస్తుతం విజయవాడ రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. రెడ్డిగూడెం మండలం మాత్రమే తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఉంది. రెడ్డిగూడెం మండలాన్ని కూడా విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. గన్నవరంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ (9 గ్రామాలు) కూడా విజయవాడ డివిజన్‌లో విలీనం చేసే పరిస్థితి కనిపిస్తోంది.

నూజివీడు రెవెన్యూ డివిజన్ పునరుద్ధరణకు అవకాశం

గన్నవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విజయవాడ రూరల్ (9 గ్రామాలు) విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండగా, మిగతా 6లో..

సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్‌తో కలెక్టర్ బాలాజీ, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



దీవులకు దారి

కృష్ణానదిపై హైలెవల్ వంతెన నిర్మాణం

- అవనిగడ్డలోని దీవుల రోడ్లకు అనుసంధానం
- 'సాస్కీ' నుంచి నిధుల కేటాయింపు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి
- జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష

6

ఆంక్షలు లేకుండా ధాన్యం కొంటాం..

రైతులకు కలెక్టర్ బాలాజీ భరోసా

మచిలీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పంటనష్టం అంచనాకు, ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని, రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొంటామని, ఈ విషయంలో రైతులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని కలెక్టర్ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నష్టపరిహారం జాబితాలో వివరాలు నమోదుచేస్తే పూర్తిస్థాయిలో రైతుల నుంచి ధాన్యం మిగతా 6లో..

నీలినీడలు

బందరులోని విజయవాడ-మచిలీపట్నంలో ఎన్‌హెచ్ అభివృద్ధి జరిగేనా?

కోనేరు సెంటర్ నుంచి మూడు స్తంభాల వరకు..

మచిలీపట్నం నగరంలో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65 విస్తరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరమ్మతులకు ఇప్పటికే నిధులు విడుదల కాగా, అధికారులు పట్టించుకోలేదు. తాజాగా విస్తరణ ప్రతిపాదన తెరపైకి రావడంతో రోజుకో వివాదం బయటకు వస్తోంది.

6

- మరమ్మతులకు గతంలోనే రూ.2 కోట్లు విడుదల
- పట్టించుకోక అవస్థలు.. తాజాగా విస్తరణ ప్రతిపాదన
- పరిహారం కింద టీడీఆర్ బాండ్లు వద్దంటున్న యజమానులు
- నగదుగా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు
- బుధవారం నాటి సమావేశంలో కీలక ప్రతిపాదనలు



కోనేరు సెంటర్‌లో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం నగరం నడిబొడ్డున ఉన్న కోనేరు సెంటర్ నుంచి మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65 ప్రారంభమవుతుంది. కోనేరు సెంటర్ నుంచి మూడు స్తంభాల సెంటర్ వరకు సుమారు 1.100 కిలోమీటర్ల మేర దీని అభివృద్ధి జరగలేదు. విజయవాడ నుంచి మూడు స్తంభాల సెంటర్ వరకు నాలుగు లేన్లుగా రహదారిని అభివృద్ధి చేసి, అక్కడి నుంచి కోనేరు సెంటర్ వరకు అభివృద్ధి చేయకుండా నిలిపివేశారు. ఈ రహదారి గుంతలు పడటంతో జాతీయ రహదారుల విభాగం ఇటీవల మరమ్మతుల కోసం రూ.2 కోట్లు విడుదల చేసింది. అయినా రహదారికి ఎలాంటి మరమ్మతులు చేయలేదు.

తెరవెనుక చక్రం తిప్పేది ఎవరో..

మచిలీపట్నం నగరంలో జాతీయ రహదారి అభివృద్ధి అంశం తెరపైకి రావడంతో ఒకరిద్దరు ప్రముఖులు రంగంలోకి దిగారు. పెద్దలతో మాట్లాడి ఒప్పిస్తామని, ఒక్కో వ్యాపారి సుమారు రూ.5 లక్షలు ఇస్తే.. మిగిలిన పని మేం చూసుకుంటామని తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. అయితే, వీరు చేసిన ప్రతిపాదనలకు వ్యాపారులు అంగీకరించనట్లు సమాచారం.

» నిధులు విడుదల చేసినా..

మూడు స్తంభాల సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకు జాతీయ రహదారిని అభివృద్ధి చేసే అంశం ఇటీవల తెరపైకి వచ్చింది. ఇది ప్రస్తుతం 60 అడుగుల వెడల్పున 1.100 కిలోమీటర్ల మేర ఉంది. 90 అడుగుల మేర విస్తరించాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ 72 అడుగులకు కుదించి రహదారికి ఇరువైపులా ఉన్న భవన యజమానులకు మిగతా 6లో..

సమావేశంలో పాల్గొన్న రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అధికారులు



ఇదేం డీపీఆర్

గందరగోళంగా ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్

- కన్సల్టెన్సీపై రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్ల ఆగ్రహం
- డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఉండాల్సిందేనని పట్టు
- అనుసంధానిత రోడ్ల విస్తరణకూ ప్రతిపాదన 6
- ఫోన్‌లో ఎంపీల దృష్టికి.. వారు కూడా తిరస్కరణ

అనుకున్నదే అయ్యింది. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినట్టు విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్ గందరగోళంగా తయారైంది. కన్సల్టెన్సీ నివేదించిన అంశాలు రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లకు ఆగ్రహం తెప్పించింది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రూ.2,500 కోట్ల నిధులు కేటాయిస్తే రూ.1,000 కోట్లకు డీపీఆర్ తయారు చేస్తారా? అంటూ సదరు సంస్థపై మండిపడ్డారు.

కైలే అనిల్‌పై కేసు నమోదు

- జగన్ పర్యటనలో అత్యుత్సాహం 6
- మందితో పోలీసుల విధులకు ఆటంకం


దుర్గమ్మ గిరి ప్రదక్షిణలో ఆలయ అధికారులు, భక్తులు

భక్తితో దుర్గమ్మ గిరిప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరిప్రదక్షిణ భక్తిప్రపత్తులతో సాగింది. ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస శాస్త్రి, ఆలయ ఉద్యోగులు, భక్తులు ఉత్సవమూర్తులను ఉంచిన బండిని లాగారు. జైభవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య గిరిప్రదక్షిణ కోలాహలంగా ప్రారంభమైంది. మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, భక్తుల భజనలు, తదితర భక్తిపారవశ్య వాతావరణంలో కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్‌ల మీదుగా బయలు దేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఉత్సవమూర్తులు కొండపైకి చేరుకున్నారు. భక్తులు కొబ్బరికాయలు, పండ్లు, హారతులు తదితరాలను సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.


ఊంజల్ సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి : కార్తీక పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచన మండపంలో వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఏఈవో బి.వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనివాసరెడ్డి దంపతులు కార్తీక దీపాలను వెలిగించి ఊంజల్ సేవలో పాల్గొన్నారు.


నారా రోహిత్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో హీరో నారా రోహిత్ దంపతులు

ఇంద్రకీలాద్రి : కనకదుర్గమ్మను సినీ హీరో నారా రోహిత్, శిరీష దంపతులు బుధవారం దర్శించుకున్నారు. నూతన దంపతులు అమ్మవారి ఆశీస్సుల కోసం ఆలయాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సంబంధీకుడైన నారా రోహిత్ దంపతులకు దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ అధికారులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈవో వీకే శీనా నాయక్ నూతన దంపతులకు అమ్మవారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దీవులకు దారి

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గంలో దీవులుగా ఉన్న గ్రామాల రూపురేఖలు మారే సమయం ఆసన్నమైంది. ఇప్పటి వరకు పడవల మార్గం తప్ప ఎలాంటి రవాణా సౌకర్యం లేని దీవుల గ్రామాలకు రాచమార్గం రానుంది. ఇందుకు కృష్ణానదిపై హైలెవల్ వంతెన నిర్మించనున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గ అభివృద్ధి, మొంథా తుఫానులో జరిగిన నష్టంపై కృష్ణాజిల్లా అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నదిపై నిర్మించే హైలెవల్ వంతెనకు దీవులు ఉన్న గ్రామాలను అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వ నిధులతో పాటు సాస్కీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తామని పవన్ వెల్లడించారు. కేంద్రప్రభుత్వ సాయంతో అవనిగడ్డ పరిధిలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను పునరుద్ధరిస్తామన్నారు. నిర్దేశిత కాలవ్యవధిలో పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిన అభివృద్ధి పనులను త్వరలోనే మొదలుపెడతామని ఆయన హామీ ఇచ్చారు. ఏటిమొగ, ఎదురుమొండి హైలెవల్ వంతెన నిర్మాణాన్ని సాకారం చేస్తామన్నారు. హైలెవల్ బ్రిడ్జి కోసం ఇప్పటికే రూ.109 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. అలైన్‌మెంట్ మార్పుల కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. రూ.60 కోట్ల వరకు వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు.

వైసీపీ నిర్లక్ష్యం వల్లే..

గతంలో వైసీపీ ప్రభుత్వం అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో ఉన్న తీర ప్రాంతంలోని కాల్వలను సముద్రానికి అనుసంధానిస్తూ నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పని చేయకపోవడంతో నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలు ముంపుబారిన పడ్డాయని పవన్ వెల్లడించారు. కనీస నిర్వహణ పనులకు నిధులు కేటాయించకపోవడంతో స్లూయిజ్‌లు మొరాయించి సముద్రం పోటెత్తినప్పుడు ఉప్పునీరు పొలాలను ముంచెత్తుతోందన్నారు. అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను పునరుద్ధరించేందుకు రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పునర్నిర్మించాల్సి ఉందన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధుల నుంచి కేటాయింపులు చేస్తామని వెల్లడించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంటనష్టం అంచనాలు త్వరగా పూర్తి చేయడంతో పాటు కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ, అటవీ, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.


మంగినపూడి బీచ్‌లో శివలింగం వద్ద మంత్రి రవీంద్ర పూజలు


దత్త రామేశ్వరం ద్వాదశబావుల వద్ద భక్తుల స్నానాలు


విజయవాడ దుర్గాఘాట్‌లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హర హర మహాదేవ..

- శివానుగ్రహం కోసం కార్తీకపౌర్ణమి పవిత్ర స్నానాలు, దీపారాధనలు
- భక్తులతో పోటెత్తిన శైవాలయాలు
- కోటి దీపాల కాంతిలో మెరిసిన ఇంద్రకీలాద్రి



ఇంద్రకీలాద్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గగుడిలో దుర్గామల్లేశ్వరులకు బుధవారం ప్రదోషకాలంలో దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక దీపోత్సవ దీప కాంతితో ఇంద్రకీలాద్రి మెరిసింది. అమ్మవారి పంచహారతులు అనంతరం ఆలయప్రధాన రాజగోపురం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఈవో వీకే శీనానాయక్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని కోటి వత్తుల దీపాన్ని వెలిగించి హర హర మహాదేవ అంటూ మల్లేశ్వరస్వామిని కీర్తించారు. "లక్ష ఒత్తుల దీపం" "కోటి దీపోత్సవం" ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ కుటుంబసభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులందరూ కుటుంబాలతో కలిసి ఈ పవిత్రమైన దీపారాధనలో పాలుపంచుకున్నారు. దివ్య దీపకాంతుల శోభతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది.


యనమలకుదురు శివాలయంలో..

మల్లేశ్వరస్వామికి జ్వాలా తోరణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. జ్వాలా తోరణంలో నుంచి స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు రోజంతా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, అన్ని ఆచారాలు వేద సంప్రదాయాలకు అనుగుణంగా జరిగేలా చూశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సిఐ గురు ప్రకాష్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కృష్ణానదికి వేకువ జాము నుంచే భక్తులు రావటం వలన ట్రాఫిక్‌ను మళ్లించారు. నది వైపు వాహనాలను కొన్ని గంటల సేపు నిలిపివేశారు. ఆ మార్గాలన్నీ కూడా వాహనాలతో, భక్తులతో కిక్కిరిశాయి.


సముద్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


దత్తరామేశ్వరంలో నగరేశ్వరునికి అభిషేకాలు

సముద్రుడికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్‌లో 80 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు విశాఖపట్నం, హైదరాబాద్, తెనాలి, గుంటూరు, రేపల్లె, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి బస్సులు, రైళ్లలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మంత్రి కొల్లు రవీంద్ర బీచ్‌లో ప్రముఖ వేదపండితులు విష్ణుబొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సముద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సముద్ర స్నానమాచరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీచ్ వద్ద, పాండురంగ స్వామి దేవస్థానంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. కార్తీక మాసంలో బీచ్‌కి లక్షలాది మంది భక్తులు వచ్చి స్నానమాచరిస్తారన్నారు. చిన్న పిల్లలకు పాలు ఇవ్వడంతో పాటు వారు తప్పిపోకుండా ట్యాగ్‌ల ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు పులిహోర ప్రసాదాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం శ్రీదత్త రామేశ్వరం సందర్శించి నగరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన దత్త రామేశ్వరం

మంగినపూడి బీచ్, దత్త రామేశ్వరం బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. ద్వాదశ బావుల వద్ద వేలాది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. నగరేశ్వరస్వామి వద్ద ఏర్పాటు చేసిన శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సముద్రం లోపలికి వెళ్ళకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా ఐదుగురు వేదపండితులతో సముద్రుడికి హారతి నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిబిరాలను ఏర్పాటు చేశారు. భక్తులకు మంచి నీటి ప్యాకెట్లను సరఫరా చేశారు.

హంసలదీవిలో కార్తీక శోభ

కోడూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రం హంసలదీవి సముద్ర తీరం వద్దకు పెద్ద ఎత్తున భక్తులు రావటంతో కార్తీక శోభ సంతరించుకుంది. బుధవారం వేకువజాము నుంచే భక్తులు సముద్ర తీరం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. దీపాలను అరటి దొప్పల్లో ఉంచి సముద్రంలోకి వదిలారు. మట్టితో సైకత లింగాలను తయారు చేసి శివారాధన చేశారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, మెరైన్ సీఐ కిషోర్ రెడ్డి పర్యవేక్షణలో కోడూరు ఎస్‌ఐ చాణిక్య మెరైన్ ఎస్‌ఐ పూర్ణ మాధురి ఆధ్వర్యంలో 75 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


యనమలకుదురు శివాలయంలో భక్తుల పూజలు

ఇదేం డీపీఆర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌పై రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల నేతృత్వంలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో బుధవారం నగరంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్టేక్ హోల్డర్స్ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీతో పాటు ఎన్‌హెచ్-65 పరిధిలోని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. ముందుగా కన్సల్టెన్సీ సంస్థ రూ.1,000 కోట్లతో కూడిన ప్రాజెక్టు నివేదికను సమావేశంలో ప్రజెంటేషన్ చేసి చూపించింది. ఆసాంతం విన్న ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంజి సర్కిల్ నుంచి పెనమలూరు వరకు ఎలాంటి వీయూపీలు లేకుండా ప్రతిపాదించటంపై బోడె, గద్దె ప్రశ్నించారు. ఎలివేటెడ్ కారిడార్‌ను ఎందుకు ప్రతిపాదించలేదన్నారు. నాలుగు కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ లేకపోతే ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా మెట్రో కారిడార్-2 వెళ్తుందని, దీనికి సంబంధించిన అధికారులతో చర్చలు జరిపారా? అని ఎమ్మెల్యేలు ప్రశ్నించగా, లేదని కన్సల్టెన్సీ సంస్థ చెప్పింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు.. మెట్రోను కూడా దృష్టిలో పెట్టుకుని డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరికి ఫోన్ చేసిన విషయాన్ని తెలిపారు. దీంతో ఇద్దరు ఎంపీలూ డీ పీఆర్‌ను తిరస్కరించారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తన నియోజకవర్గం పరిధిలో సబ్‌వే, వీయూపీల గురించి చెప్పారు.

కలెక్టర్ల అసహనం

డీపీఆర్‌పై కలెక్టర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మెట్రో అధికారులతో కలిసి మూడు రకాల డిజైన్లను సిద్ధం చేయాలని సూచించారు. బెంజిసర్కిల్ నుంచి చిన ఓగిరాల వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించలేదని, వీయూపీలు తక్కువగా ఉన్నాయన్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ విజయవాడ నగర, శివారు ప్రాంతాలతో పాటు భవిష్యత్తులో పోర్టు ట్రాఫిక్ మరింత పెరగబోతోందని, ఇలాంటపుడు ఎలివే టెడ్ కారిడార్ మాత్రమే పరిష్కారమన్నారు.

బెంజిసర్కిల్ వరకు విస్తరించాల్సిందే..

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) హద్దుగా ఎన్‌హెచ్-65 విస్తరణకు డీపీఆర్‌ను తయారు చేయటంపై ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో వచ్చే ఓఆర్ఆర్ కోసం విజయవాడ ప్రజలను ఇబ్బంది పెడతారా అని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ ప్రాతిపదికగా కాకుండా బెంజిసర్కిల్ వరకు కూడా విస్తరించాల్సిందేనని పట్టుబట్టారు.

అనుసంధానిత రోడ్లు కూడా విస్తరించండి

ఎన్‌హెచ్-65, 16ను అనుసంధానించే రోడ్లు మూడు ఉన్నాయని, వాటిని కూడా ఇదే డీపీఆర్‌లోకి తీసుకొచ్చి విస్తరించేందుకు ప్రతిపాదించాలని ఎమ్మెల్యేలు సూచించారు. ఆటోనగర్ బస్ టెర్మినల్ రోడ్డు ఎన్‌హెచ్-16, 65ను కలుపుతుందని, ఈ రోడ్డును కూడా ఎన్‌హెచ్ పరిధిలోకి చేర్చి విస్తరించాలని సూచించారు. ఎనికేపాడు-తాడిగడప 100 అడుగుల రోడ్డును, కంకిపాడు-కేసరపల్లి రోడ్డును కూడా విస్తరించేలా తుది డీపీఆర్ ఉండాలని సూచించారు. వీటి అభివృద్ధికి భూములను ప్రత్యేకంగా చేర్చాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, కృష్ణా జేసీ నవీన్, ఎన్టీఆర్ జిల్లా డీఆర్వో లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, మెట్రో అధికారులు పాల్గొన్నారు.

కైలే అనిల్‌పై కేసునమోదు

- జగన్ పర్యటనలో అత్యుత్సాహం
- మందితో పోలీసుల విధులకు ఆటంకం

పమిడిముక్కల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల మండలం గోపువానిపాలెం వద్ద హైవేపై విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించినందుకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు పమిడిముక్కల పోలీసులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా అనిల్ కుమార్ భారీ సంఖ్యలో అనుచరులను పోగేసుకుని గోపువానిపాలెం క్రాస్‌రోడ్డువద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సీఐ చిట్టిబాబును మీసంగతి చూస్తాం..! అంటూ దుర్భాషలాడుతూ.. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాదనకు దిగినందుకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. డ్రోన్‌ఫుటేజి ద్వారా ఆధారాలు సేకరించి త్వరలో మిగిలిన వారిని గుర్తించి చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.

నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా ఇటీవల నోటీసులు అందజేశారు. నష్టపరిహారం కింద నగదుకు బదులుగా టీడీఆర్ బాండ్లు ఇస్తామని మునిసిపల్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు నోటీసులు

విస్తరణలో భూమి, భవనాలు కోల్పోయే యజమానులకు టీడీఆర్ బాండ్లు మాత్రమే ఇస్తామని మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చెప్పడంతో కొందరు వ్యాపారులు అంగీకరించలేదు. న్యాయవాదుల ద్వారా మునిసిపల్ కమిషనర్‌కు నోటీసులు పంపారు. టీడీఆర్ బాండ్లు తమకు వద్దని, భూమి, భవనాలు కోల్పోయే వారికి.. రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి ధరను బట్టి అసలు ధరతో పాటు మరో మూడు రెట్లు అధికంగా నగదు ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. భవనాలు కూలగొట్టాల్సి వస్తే ఆ భవనం ఖరీదు, అందుకయ్యే ఖర్చులు, భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు అయ్యే ఖర్చులు, ఇతరత్రాలకు సంబంధించిన ఖర్చులను కూడా చెల్లించాలని సూచించారు.

సర్వీస్ రోడ్లు వేయాలి

జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే అంశంపై విజయవాడలో బుధవారం జరిగిన సమావేశానికి కలెక్టర్ బాలాజీతో పాటు మచిలీపట్నం, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ల అధికారులు హాజరయ్యారు. మచిలీపట్నం నుంచి గూడూరు వరకు 8 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్లు వేయాలని ప్రతిపాదన పెట్టారు. దీంతో పాటు రామరాజుపాలెం, తరకటూరు జంక్షన్, నిమ్మలూరు బెల్ కంపెనీ, జుజ్జువరం వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. మూడు స్తంభాల సెంటర్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బిగ్‌రౌండ్ ఎబౌట్ నమూనాతో సర్కిల్‌ను కూడా నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. దాములూరు టోల్‌గేట్ వద్ద మాత్రమే అంబులెన్స్ అందుబాటులో ఉందని, మచిలీపట్నంలో కూడా అందుబాటులో ఉంచాలనే ప్రతిపాదన చేశారు. అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్ల వద్ద జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని, బస్‌షెల్టర్ వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించాలని సూచించారు. దీంతో పాటు జనావాసాలు లేని రహదారి వెంబడి డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని కోరారు.

పునర్విభజన.. పునరుద్ధరణ

(5వ పేజీ తరువాయి)

బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాలు గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు ఉన్నాయి. ఈ మూడు మండలాలు ఉయ్యూరు డివిజన్ పరిధిలో ఉన్నాయి. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ల ప్రకారం ఈ రెండు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకొచ్చే క్రమంలో గన్నవరం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయవచ్చనే చర్చ నడిచింది. తాజాగా మంత్రుల బృందం గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలనే ఎన్టీఆర్ జిల్లాలో కలపాలన్న దిశగా చర్చ సాగించటంతో గన్నవరం రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటుచేసే అవకాశమే ఉండకపోవచ్చు. ఒకప్పుడు నూజివీడు రెవెన్యూ డివిజన్‌గా ఉంది. పరిపాలనా భవనం కూడా అక్కడ ఉంది. కాబట్టి ప్రస్తుత తిరువూరు రెవెన్యూ డివిజన్‌ను రద్దుచేసి, నూజివీడు రెవెన్యూ డివిజన్‌ను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలు, తిరువూరు నియోజకవర్గ పరిధిలోని ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట మండలాలను నూజివీడు డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

కైకలూరు.. కృష్ణాజిల్లాలో కలిపే అవకాశం


కైకలూరు నియోజకవర్గాన్ని తిరిగి కృష్ణాజిల్లాలోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై మంత్రుల సమావేశంలో చర్చ జరిగింది. ఈ నియోజకవర్గంలోని కలిదిండి, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాలను పూర్తిగా గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది.

పామర్రులో రెండు డివిజన్ల సమస్య తీరనుందా?

పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రమే గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. తాజా మార్పుల నేపథ్యంలో పెదపారుపూడి మండలాన్ని కూడా ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే పామర్రులో రెండు డివిజన్ల సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పెనమలూరు కృష్ణాజిల్లాకే పరిమితమా?

పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాలోనే కొనసాగించాలన్న ఆలోచనలో మంత్రుల బృందం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్క పెనమలూరు మండలంలో కొన్ని గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాలు, మండలాలుకృష్ణాజిల్లాలోనే అంతర్భాగంగా ఉండటం వల్ల ఆ నియోజకవర్గాన్ని అక్కడే కొనసాగించాలన్న ఆలోచన చేసినట్టు తెలుస్తోంది. కాగా, విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో పెనమలూరు మండలంలోని కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాలతో పాటు కంకిపాడు మండల పరిధిలోని గంగూరు, గోసాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పేరు, ఉప్పులూరు గ్రామాలు పాత (45 విలీన గ్రామాల) జాబితాలో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదించిన జాబితాలో కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని పూర్తి గ్రామాలను చేర్చారు. పెనమలూరు నియోజకవర్గం కృష్ణాజిల్లాలో ఉంటే గ్రేటర్ విజయవాడ ఎలాసాకారం అవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.



కన్నుల పండువగా జ్వాలా తోరణం

మోపిదేవి: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జ్వాలా తోరణం మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని స్వామివారికి ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

సంక్రాంతికి సీ ప్లేన్

(5వ పేజీ తరువాయి)

నడపటానికి నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. నూతన సంవత్సరం మొదటి రెండు వారాల్లోనే వాటర్ ఏరోడ్రమ్ పనులు కూడా పూర్తిచేసుకుని ఆపరేషన్‌కు శ్రీకారం చుడతారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ సేవలకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో.. కొద్దికాలం కిందట విజయవాడ నుంచి శ్రీశైలానికి ట్రయల్ రన్‌ను కూడా విజయవం తంగా నిర్వహించారు. ఆ తర్వాత ఫీజిబిలిటీ సర్వే, డీపీఆర్ రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విజయవాడ నుంచి సీ ప్లేన్లు నడపటానికి సానుకూలంగా రిపోర్టు వచ్చింది. ఇదే క్రమంలో డీపీఆర్ రూపకల్పన పూర్తయింది.

కృష్ణానదిలో వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటు

కృష్ణానదిలో వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటుకు రూ. 20 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇందుకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. సీ ప్లేన్స్‌ను మాత్రం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తారు. కొద్దికాలం కిందట స్పైస్‌జెట్ సంస్థ ట్రయల్ రన్ నిర్వహించింది. విజయవాడ నుంచి శ్రీశైలానికి రోడ్డు మార్గం అయితే 263 కిలోమీటర్లు ఉండగా, ప్రయాణ సమయం 5.30 గంటలు. సీ ప్లేన్‌లో అయితే కేవలం 45 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అలాగే, హైదరాబాద్, విశాఖపట్నానికి కూడా ఈ సర్వీసులు నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు వెళ్లే సీ ప్లేన్ హుస్సేన్‌సాగర్‌లో ల్యాండ్ అవుతుంది. విశాఖపట్నం అయితే సముద్రంలో ల్యాండ్ అవుతుంది. ఇందుకోసం విశాఖపట్నంలో కూడా వాటర్ డ్రోమ్‌ను ప్రభుత్వమే నిర్మిస్తుంది. హైదరాబాద్‌లో అక్కడి ప్రభుత్వం నిర్మించే అవకాశం ఉంది. తొలిదశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి సీ ప్లేన్ ఆపరేషన్లు ప్రారంభించాలని, మలిదశలో అరకు వ్యాలీ, లంబసింగి, రుషికొండ వంటి ప్రాంతాలను ప్రభుత్వం ఎంపిక చేసింది.

ఆంక్షలు లేకుండా..

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేయరనే ప్రచారం జరుగుతోందని, ఇందులో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం ద్వారా రైతుల నుంచి ధాన్యం కొంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏడు రోజులుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పంటనష్టం అంచనాలను తయారుచేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఈ వివరాలను నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంట వివరాలు పొరపాటున ఈ-క్రాప్‌లో నమోదు కాకున్నా ఇబ్బంది లేదని, కొనుగోలు అంశంలో రైతులు అధైర్యపడొద్దని సూచించారు.

అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.12,11లక్షలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈవో తారకేశ్వరరావు ఆలయంలోని హుండీలను తెరిచి లెక్కించారు. గడిచిన 85 రోజులుకు గాను హుండీలో రూ.12,11,710లు ఆదాయం లభించినట్లు ఈవో తారకేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, పలు భక్త బృంద సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.









బాపులపాడు శివాలయంలో నిర్వహిస్తున్న జ్వాలాతోరణం.. గన్నవరం శివాలయంలో.. ఉయ్యూరు శివాలయంలో భక్తుల పూజలు

శివాలయాల్లో కార్తీక శోభ

- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- కార్తీక దీపారాధనతో పాటు ప్రత్యేక పూజలు
- శివాలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని బుధవారం బాపులపాడు శివాలయంలో స్వామి వారిని అధిక సంఖ్యలో మహిళలు దర్శనం చేసుకొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, సభ్యులు తమిరి రమేష్, వీర మాచనేని నాగయ్య, కొల్లి వెంకట్రావు, రాంబాబు తదితరులు పర్యవేక్షించారు. స్థానిక వేంకటేశ్వ రస్వామి దేవస్థానంలో ఈవో వై. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారా మాచార్యులు ఆధ్వర్యంలో సహ అర్చకులు హోమం జరిపించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వీరవల్లి కొండేశ్వరస్వామికి అర్చకుడు కుందుర్తి మురళీశర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మడిచర్ల మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో అర్చకుడు సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. పెరికీడు ముక్తేశ్వరస్వామికి అర్చకులు సీతారామయ్య, శ్యామ్ ఆధ్వర్యంలో పంచామృ తాభి షేకం, రుద్రాభిషేకం నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. కానుమోలు, సిరివాడ, సింగన్నగూడెం శివాలయాల్లో కార్తీక దీపారాధన నిర్వహించారు.

సర్వ పాపహరణం జ్వాలాతోరణం

కార్తీక మాసంలో పౌర్ణమి రోజున మాత్రమే శివాలయాల్లో నిర్వహించే జ్వాలా తోరణం నుంచి వెళ్లడం సర్వపాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకమని అర్చకులు సీతారామయ్య తెలిపారు. సింగన్నగూడెం సోమేశ్వరస్వామి దేవస్థానంతో పాటు శివాలయాల్లో బుధవారం జ్వాలాతోరణాన్ని ప్రజ్వలింపజేశారు. ప్రత్యేక పూజలనంతరం భక్తుల శివనామస్మరణ మధ్య మేళతాళాలతో శివపార్వతులను పల్లకీలో ఉంచి జ్వాలాతోరణం ద్వారా ప్రదక్షిణ నిర్వహించారు. తదనంతరం భక్తులు జ్వాలాతోరణం ద్వారా వెలుపలికివచ్చారు. పెరికీడు, సిరివాడ, కానుమోలు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో జ్వాలాతోరణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు జ్వాలాతోరణ దర్శించుకున్నారు.

ఉయ్యూరు: కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఉదయం నుంచి శివాలయాల్లో కార్తీక దీపారాధన చేసి పూజలు చేసేందుకు భక్తులు తరలిరాగా ఆలయాలు కిటకిటలాడాయి. శ్రీజగదాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపారాధన చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

● గండిగుంట అయ్యప్పస్వామి ప్రాంగణం ఓంకారేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కోటిదీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఎస్. కామేశ్వరరావు ప్రత్యేక పూజలు, అర్చన చేయించారు.

కంకిపాడు: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకొని కేదారేశ్వ రవ్రతం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కానూరు: కానూరులో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుక లు వైభవంగా జరిగాయి. విష్ణు ఆలయాలు, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కానూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. పూజా క్రతువులను ఆలయ పూజారులు ఫణి, కృష్ణఫణిలు నిర్వహించారు.

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాల తోరణ మహో త్సవం నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, చందనం, 108 రజిత బిల్వదళాలతో అలంకరణ జరిపారు. అనంతరం అమ్మ వార్లకు హస్తాభరణాలు (గాజుల)తో అలంకరణ చేశారు. సాయంత్రం అశేష భక్త జనం మధ్య జ్వాలతోరణ మహోత్సవాన్ని నిర్వహించారు.

యనమలకుదురులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలు

పెనమలూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయల ప్రకారం ఎమ్మెల్యేకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధి ప్రదాత సంగా నరసింహరావు ఎమ్మెల్యే దంపతులకు, ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు స్వాగతం పలికారు.





కానూరులో బుధవారం కురిసిన భారీ వర్షానికి జలమయమైన రోడ్లు







కంకిపాడు శివాలయంలో.. యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో

డ్వాక్రా మహిళలకు యూనియన్ బ్యాంకు
విజిలెన్స్ అవేర్‌నెస్‌పై అవగాహన

పెనమలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా పోరంకి, పెనమలూరు శాఖల్లో బుధవారం డ్వాక్రా మహిళలకు విజిలెన్స్ అవేర్‌నెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మచిలీపట్నం ప్రాంతీయ కార్యాలయం తరఫున జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో మహిళలకు పారదర్శకత, నైతిక విలువలు, అవినీతి రహిత సమాజం కోసం చేయాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రాంతీయ విజిలెన్స్ అధికారి కే వెంకట్రాజు, పెనమలూరు మేనేజరు నందకిషోర్, పోరంకి శాఖ చీఫ్ మేనేజరు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరు యూనియన్ బ్యాంకు శాఖలో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిన ఓగిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉయ్యూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలుచేసి సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల వెంకట కుటుంబరావు అన్నారు. చిన ఓగిరాల పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట చేసికొచ్చే తరుణంలో ప్రకృతి వైపరీత్యాలు నష్టం కలిగిస్తున్నా రైతులను ఆదుకు నేందుకు కూటమి ప్రభుత్వం వెనుకాడేది లేదన్నారు. మొంథా తుపానుకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం త్వరలో అందుతుందన్నారు. కఠారి దుర్గారావు, పాలడుగు వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు ఢీకొని రాజస్థాన్ వాసి మృతి

ఉయ్యూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాయిమహల్ సెంటర్‌లో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రజాపత్ జిత్తు (35) స్థానిక రాజస్థాన్ టీస్టాల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి సాయిమహల్ సెంటర్‌వద్ద రోడ్డుదాటుతున్న క్రమంలో విజయవాడ నుంచి పామర్రు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. గాయపడిన అతనిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆశాలకు సంపూర్ణ ఆరోగ్యం పుస్తకాల పంపిణీ

కానూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కానూరులోని ఆయుర్వేద డిస్పెన్సరీ ద్వారా బుధవారం ఆశా కార్యకర్తలకు పుస్తకాలు అందజేశారు. కానూరు, సనత్‌నగర్‌లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆశా కార్యకర్తలకు ఆరోగ్యంపై అవగాహన పుస్తకాలను పంపిణీ చేశారు. వీరు సాధారణ వ్యాధులతోపాటు మధుమేహ నియంత్రణ తదితర అంశాలను తమతమ పరిధిలోని ప్రజలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఆయుర్వేద డిస్పెన్సరీ సిబ్బంది కోటేశ్వరరావుతోపాటు ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.



ఆదర్శనీయం ఆంతోని జీవితం

బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

గన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు వ్యాపింపజేసిన పునీత ఆంతోని వారి జీవితం ఆదర్శనీయమని విజయవాడ బిషప్ తెలగ తోటి జోసఫ్ రాజారావు అన్నారు. మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఇటలీ దేశంలో పాదువపురం నుంచి పునీత ఆంతోని వారి ప్రధాన దేవాలయం నుంచి తీసుకువచ్చిన అద్భుత ఆంతోని స్వరూపాన్ని దేవాలయంలో మంగళవారం రాత్రి ప్రతిష్ఠించారు. తొలుత సమిష్టి దివ్యబలిపూజ నిర్వ హించారు. విజయవాడ మేత్రాసన పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ భావన విజయరాజు, సునీల్, విచారణ గురువులు నూతల పాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

ఉంగుటూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి (డీఎంఅండ్ హెచ్‌వో)పి.యుగంధర్ ఆదేశాలమేరకు బుధవారం మండలంలోని పొట్టిపాడు, ఆనందపురంలో పంచాయతీ, వైద్యఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ముందుగా పంచాయతీ సిబ్బందితో వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

హడలెత్తిస్తున్న ఆఫ్రికా నత్తలు

ఎక్కడి నుంచి వచ్చాయో కానీ ఈ ఆఫ్రికా నత్తలు.. పంటల్ని గంటల వ్యవధిలో హాంఫట్ చేసేస్తున్నాయి. బొప్పాయి, కూరగాయలపై ముప్పేట దాడి చేసి నమిలేస్తున్నాయి. నత్తలున్నాయని గ్రహించేలోపు పంటలకు తీరని నష్టం జరిగిపోతోంది. ఒక పక్క ప్రకృతి వైపరీత్యాలతో సతమతమవుతున్న అన్నదాతలకు అప్పుడు నత్తల బెంగ పట్టుకుంది. ఎక్కడ్నుంచి వచ్చాయో తెలియదు కానీ పంటలను తినేస్తున్నాయని వారు వాపోతున్నారు. ఒకప్పుడు వంకాయలను గ్రేడ్ చేసే సమయంలో పుచ్చులు కనిపించేవని, ఇప్పుడు నత్తలు తిన్న కాయలను కూడా గ్రేడింగ్ చేసుకోవాల్సి వస్తుందని, నత్తలు తిన్న కాయలను చెట్లకు వదిలేయలేక కోసి బయట పారేసుకోవాల్సి వస్తుందని లబోదిబోమంటున్నారు.

\- జి.కొండూరు, ఆంధ్రజ్యోతి

● పంటల్ని నమిలేస్తున్నాయ్ ● కూరగాయ, బొప్పాయి పంటలపై ముప్పేట దాడి ● ఒక జంట నత్తలకు 2 వేల గుడ్లు

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గడ్డమణుగు పొలంలో కడియాల వెంకటేశ్వరరావు అనే రైతు సాగు చేసిన వంగ తోటలో వంకాయలు కాపుకొచ్చాయి. మంచి ధర లభిస్తోంది రేపో మాపో కోద్దాం అనుకుంటున్న ఆ రైతుకు చెట్టుపై ఒక నత్త కనపడింది. అరే ఒకటి కదా అని తీసేసి రెండు మూడు రోజుల తర్వాత కోతకు కూలీలను పిలిచి కాయలు కోయిద్దామనుకుంటున్న తరుణంలో వంకాయలకు గాట్లు ఉండటం గమనించాడు. చాలావరకు సగం తిని ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఉన్నటుండి ఒక్కొక్క చెట్టుకు అరడజనుకు పైగా నత్తలు దర్శనమివ్వడం రోజురోజుకూ అవి బలిష్ఠంగా పెరగడాన్ని గమనించి ఏరించాడు. అయితే అప్పటికే పంటకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇతర ప్రాంతాల నుంచి రాక

మొక్కలపై అభిమానంతో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు తెచ్చుకుంటున్న మొక్కల ద్వారా ఆఫ్రికన్ నత్తలు ఈప్రాంతానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. నత్త మాంసం తింటే మంచిదనే ఆలోచనతో మంచి నత్తలు అని తెస్తే ఆఫ్రికన్ నత్తలు వచ్చినట్లు తెలుసుకొని వారు అంతా అవాక్కయ్యారు.

ఒక జంట నత్తకు 2 వేలు గుడ్లు

ఒక జంట నత్తలకు 2వేలు గుడ్లు పెడతాయి. ఈక్రమంలో వాటి సంతానం రోజురోజుకు దినదినాభివృద్ధి చెందుతుంది. బొప్పాయి పండ్లు అంటే చాలా ఇష్టమని మెత్తగా ఉంటాయి కనుక ఇష్టానుసారంగా తినేస్తాయి. బొప్పాయి లేకుంటే ఏ రకం పంటపై అయినా మూకుమ్మడి దాడి చేస్తాయి. కాయలు, పండ్లు లేకున్నా ఎండి ఆకులనైనా కొమ్మలనైనా తినేస్తాయి. భూమిలో నివాసం ఉంటాయి.




నత్తలు తిన్న వంకాయలు, రోడ్డు పక్కన పారేసిన నత్తలు తిన్న వంకాయలు

పంటకు చాలా నష్టం చేశాయి

కడియాల వెంకటేశ్వరరావు, కౌలు రైతు, జి.కొండూరు



నత్తలు వంగ పంటకు చాలా నష్టం చేశాయి. కోత దశలో ఉన్న కాయల్ని తినేడం వల్ల అవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. పురుగుల నివారణకు కొట్టే మందులను నత్తలు తట్టుకొని కాయల్ని తినేస్తున్నాయి. ఇప్పటికే రెండు మూడు సార్లు కూలీలతో ఏరించినా మళ్లీ మళ్లీ పుట్టుకొస్తూనే ఉన్నాయి. నత్తల నివారణకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

ఇలా నివారించుకోవచ్చు

వేణు, ఉద్యానశాఖ అధికారి ఇబ్రహీంపట్నం

కాపర్ సల్ఫేట్ 3 గ్రాములు, ఫెర్రస్ సల్ఫేట్ 3 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి నత్తలు యాక్టివ్‌గా ఉండే ఉదయం వేళల్లో పిచికారి చేసుకోవాలి. ఒక ఎకరానికి 100 లీటర్లలో మందు కలిపిన ద్రావణం పిచికారీ చేస్తే నత్తలు కింద పడిపోతాయి. వాటిని గ్లౌజులు తొడిగిన చేతులతో ఏరి ఉప్పు కలిపిన నీటిలో వేసుకొని నివారించుకోవచ్చు. గ్లౌజులు వేసుకోకుండా నత్తలు పట్టుకుంటే వాటి నుంచి వచ్చే సొంగకు చర్మంపై దద్దుర్లు, దురదలు వచ్చే ప్రమాదం ఉంది.

బీసీలకు ఆధునిక పరికరాలు

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ● చైర్మన్లు, డైరెక్టర్ల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం
● ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి ● 3వ రోజు వివిధ కార్పొరేషన్స్ పాలక మండళ్లతో మంత్రి భేటీ

గొల్లపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకం అమలుపై మూడు రోజుల వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ఎస్ సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లు అందించిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. కుల, చేతివృత్తులు వారికి ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి కల్పన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెండు రోజులుగా ఈ వర్క్ షాపులో 17 మంది చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం కావడం జరిగిందని, వారి నుంచి అనేక విషయాలు తెలుసుకున్నామన్నారు. కార్పొరేషన్ చైర్మన్ల గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించేలా ప్రాధాన్యతనిచ్చారన్నారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సంబంధించి ఉచితంగా కోచింగ్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఏ వృత్తిదారుడు ఎలాంటి పరికరాలు ఆశిస్తున్నారనే విషయమై సర్వే రూపంలో ఒక నివేదిక రూపొందించామని, దాన్ని సీఎం చంద్రబాబుకు అందిస్తామన్నారు.



గొల్లపూడిలో వివిధ కార్పొరేషన్ల పాలక మండళ్లతో భేటీ అయిన మంత్రి సవిత

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

తొలుత 17 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత సమావేశమయ్యారు. ఆదరణ 3.0 అమలుపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంతో పాటు చైర్మన్లు, డైరెక్టర్లకు వారి గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కార్పొరేషన్ల పాలక మండళ్లను ఉత్సవ విగ్రహాల మాదిరిగా కాకుండా వారికి బాధ్యతలు అప్పజెబుతామన్నారు. అనంతరం ఆయా కార్పొరేషన్ల వారీగా ముఖాముఖి నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఆయా బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖాధికారులు, తదితరలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పారాగ్లైడింగ్..!

● విజయవాడ ఉత్సవ్‌లో తాత్కాలికంగా ఏర్పాటు
● నగర ప్రజల నుంచి అనూహ్య స్పందన
● తక్కువ ఖర్చు కావటంతో ఆదరణ
● శాశ్వత ఏర్పాటు ఆలోచనలో జిల్లా యంత్రాంగం



ఆంధ్రజ్యోతి, విజయవాడ: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఎన్టీఆర్ జిల్లా వ్యవస్థ సద్వినియోగం చేసుకోవాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీలో పారాగ్లైడింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ - 2025లో భాగంగా తాత్కాలికంగా కొద్దిరోజుల పాటు పారాగ్లైడింగ్‌ను నిర్వహించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో హెలీ రైడింగ్ సందర్భంలోనే ఇక్కడ పారాగ్లైడింగ్ ఏర్పాటు చేశారు. పారా గ్లైడింగ్ ఖర్చు తక్కువ కావటంతో పర్యాటకుల నుంచి ఆదరణ వచ్చింది. విజయవాడ ఉత్సవ్ ముగియటంతో పారాగ్లైడింగ్ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా అధికారులు పారాగ్లైడింగ్‌పై దృష్టి సారించారు. హెలీ టూరిజంను అభివృద్ధి చేసే క్రమంలో ముందుగా పారాగ్లైడింగ్‌ను ప్రారంభించాలని భావిస్తోంది. దీనికి సరైన ప్రాంతంగా ఇబ్రహీంపట్నం ఫెర్రీని ఎంచుకుంది. పారాగ్లైడింగ్ నిర్వహించే సంస్థలతో సంప్రదింపులు జరిపి వీలైనంత త్వరగా తక్కువ ఖర్చుతో పారాగ్లైడింగ్‌ను ప్రారంభించాలని భావిస్తోంది. హెలీ రైడింగ్‌తో పోల్చుకుంటే పారాగ్లైడింగ్‌కు ఖర్చు తక్కువగా ఉండటంతో ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించిన పారాగ్లైడింగ్ ఈవెంట్ ట్రయల్ రన్‌గా ఉపయోగపడింది. దీంతో పాటు పర్యాటకుల ఆదరణ ఎలా ఉంటుందన్న విషయం తెలిసింది.



ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

● రూ.74,600 స్వాధీనం

విజయవాడ/ఇబ్రహీంపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ సోదాలు జరిగాయి. ఏసీబీ జిల్లా డీఎస్పీ బీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, సత్యనారాయణ ఈ తనిఖీలు చేశారు. కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేస్తుండగా సబ్ రిజిస్టర్ ఎస్కే మహమ్మద్ సమీపంలోని బీరువాలో లెక్కలు లేని నగదు ఉన్నట్టు గుర్తించారు. రూ.74,600ను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు సోదాలు నిర్వహించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులకు వసూళ్లు చేయడానికి కార్యాలయంలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులున్నట్టు అధికారులు గుర్తించారు. బీరువాలోని నగదు ఎలా వచ్చిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. నగదు విషయంతో పాటు డబుల్ రిజిస్ట్రేషన్ ఏమైనా జరిగాయా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. సోదాల సమయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన 10 మందిని అధికారులు విచారించారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు నాగరాజు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



హ్యుండయ్ వెన్యూ కారును ఆవిష్కరిస్తున్న కోనేరు హంపి

విజయవాడ మార్కెట్లోకి హుండాయ్ వెన్యూ

గుణదల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల అభిరుచి మేరకు హుండాయ్ వెన్యూ కారును విజయవాడ మార్కెట్లోకి ప్రవేశపెట్టినట్టు భారత చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి తెలిపారు. ఎనికేపాడులోని లక్కీ హుండాయ్ షోరూమ్‌లో జరిగిన హుండాయ్ వెన్యూ కారు ఆవిష్కరణ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కోనేరు హంపి విచ్చేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని హుండాయ్ వెన్యూ కారు రూపుదిద్దుకోవడంతో వినియోగదారులు ఈ కారును ఇష్టపడుతున్నారన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కారు రూపకల్పన జరిగిందని హుండాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ సీనియర్ మేనేజర్ డీ ధీరజ్ స్వరూప్ తెలిపారు. పవర్‌లిఫ్టర్, వెయిట్ లిఫ్టర్ సాదియా అల్మాస్ షేక్, ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే నాగుల్ మీరా, లక్కీ హుండాయ్ షోరూమ్ జిఎమ్ రోహిణీ కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొడాలి అనుచరుడు అరెస్టు

● నకిలీ పోలీసుగా చలామణి అవుతూ బెదిరింపులు



శ్రీనివాసరావును అరెస్టు చేసిన పోలీసులు

గుడివాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ గా నటిస్తూ, ఆలయ పూజారి, ఇతరులను బెదిరిస్తున్న మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరుడు, వైసీపీ గుడివాడ నియోజకవర్గ ప్ర చార కార్యదర్శి ఘంటా హేమ శేష శ్రీనివాసరావును గుడివాడ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గుడివాడ మండలం మోటూరు గ్రా మంలోని శ్రీగంగానమ్మ తల్లి దేవాలయానికి సంబంధించి కమిటీలో అంతర్గత విభేదాలున్నాయి. ఈ క్రమంలో వైసీపీ నేత శ్రీనివాసరావు పోలీసు సబ్ ఇన్స్‌పెక్టర్ యూనిఫామ్ ధరించి, పోలీసుగా నటిస్తూ, దేవాలయ పూజారిని, ఇతరులను బెదిరించాడు. దేవాలయ తాళాలు, వాటర్ బోరు మోటార్‌ను బలవంతంగా లాక్కుని తీసుకుని పోయాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన శ్రీగంగానమ్మ తల్లి ఆలయ చైర్మన్ అనందాసు వెంకటరామయ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు. బుధవారం గుడివాడ మండలం మోటూరులో ఇంటి వద్ద ఉన్న ఘంటా శ్రీనివాసరావును రూరల్ ఎస్ఐ ఎన్ చంటిబాబు అరెస్టు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, శ్రీనివాసరావుకు 19 వరకు రిమాండ్ విధించారు.



కాలువలో బూడిదను తోడి రోడ్డు సగానికి పైగా పోసిన గుట్టలు

బూడిద దందాలో నీకెంత.. నాకెంత..?

● వైసీసీ చోటా నేతతో అధికారుల లాలూచీ..!

ఇబ్రహీంపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ చోటా వైసీపీ నేత బూడిద దొంగతనానికి అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ ఆరోపిస్తున్నారు. ఒకపక్క ఉచిత బూడిద లోడింగ్ కోసం పోరాటం చేస్తుంటే ఆ చోటా నేత బూడిద మేత అధికమయిందని ఆవేదన చెందుతున్నారు. బూడిద చెరువులోకి వెళ్లే పైపులైన్‌కు లీకులు పెట్టి బూడిద నీటితో పాటు కాలువలోకి వచ్చే బూడిదను యంత్రాలతో ఎత్తి రహదారిపై గుట్టలు గుట్టలుగా పోయి అమ్ముకుంటున్నాడని, ఎన్టీటీపీఎస్ అధికారులు అతడితో బేరం మాట్లాడుకొని నీక్కొంత, మాక్కొంత అనే సిద్ధాంతంతో ఎంచక్కా సొమ్ము చేసుకుంటూ తమ కడుపు కొడుతున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో సైతం వైసీపీ చోట నేత చేస్తున్న బూడిద దందాకు చెక్ పెట్టాలని ఎన్టీటీపీఎస్ ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

వీఎంసీలోని సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు భర్తీచేయాలి

● డీఈవోను కోరిన ఉపాధ్యాయ సంఘ నేతలు

విజయవాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ టీచర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య డీఈవో యూవీ సుబ్బారావును కోరారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం బుధవారం నగరంలోని బిషప్ అజరయ్య స్కూల్‌లో జరిగింది. కిందటేడాది ఎస్ఎస్‌సీ విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణలో భాగంగా సెలవుదినాల్లో పనిచేసిన వారికి సీసీఎల్ లీవ్ యాప్ ద్వారా 10రోజుల సెలవులు అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లీవ్ యాప్‌లో సెలవులు ఎడిట్ ఆప్షన్‌ను డీడీవోలకు ఇవ్వాలని, ఫేషియల్ అటెండెన్స్‌లో సాంకేతిక సమస్యలున్నా, హాజరు పడకపోయినా ఉపాధ్యాయులు సకాలంలో రావడం లేదని ఉపాధ్యాయుల పేర్లను గ్రూపుల్లో వైరల్ చేయకుండా ఉండాలన్నారు. బదిలీల అనంతరం వేతనం రాని ముగ్గురు టీచర్ల జీతాల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరపాలని డీఈవోను కోరారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓర్వలేక వైసీపీ అసత్య ప్రచారం

● ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మండిపడ్డారు. బుధవారం గూడూరులో కృష్ణప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, మంగళవారం జరిగిన జగన్ పర్యటనలో మాట్లాడిన రైతులు వైసీపీకి చెందిన కార్యకర్తలేనని, వారికి సెంటు పొలం లేదన్నారు. ఫేక్ ఆర్టిస్టులను తీసుకువచ్చి రైతులని నమ్మించి పంట నష్టపోయామని మాట్లాడించడం సిగ్గుచేటన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండలాధ్యక్షులు పోతన స్వామి, ఉమా సాయిరామ్, కోలపల్లి రజని, జనసేన నేత కొరియర్ శ్రీను, కూటమి నేతలు ఎన్‌ఏ బేగ్, కట్టా మునేశ్వరరావు, పోతుల రాము, శాయన సోమయ్య, పోతన రామోజీ, కాట్రగడ్డ రత్నబాబు, బాసంశెట్టి శ్రీను, మునగాల భాస్కర్, జన్ను ప్రసాద్, గంజాల గోవర్ధన్, చోడగం భిక్షాలరావు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ ఫేక్ ప్రచారం



మచిలీపట్నం నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుపాను నష్టం పరిశీలన కు కృష్ణాజిల్లాకు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ పెడన నియోకవర్గ రై తులతో కాకుండా మచిలీపట్నం మండలం కోన గ్రామానికి చెందిన రైతుల తో ప్రభుత్వంపై విమర్శలు చేయించిన విషయం సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పెడన నియోజకవర్గం ఆకుమర్రు, రామరాజుపాలెం గ్రామా ల్లో పంటదెబ్బ తింటే కోన గ్రామానికి చెందిన గంజాల వెంకటేశ్వరరావు అనే రైతుతో తమకేమీ అందడం లేదని చెప్పించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈప్రాంతంలో రైతులు రాకపోవడం వల్లే బయటి మండలాల నుంచి రైతులకు తీసుకువచ్చారా అనే అంశంపై సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు. బుధవారం మచిలీపట్నం ఆర్అండ్‌బీ అతిథి గృ హంలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ వాస్తవాలు పక్కనపెట్టి ప్రభుత్వంపై బురద చల్లేలా వైఎస్ జగన్‌తో స్థానిక నేతలు బలప్రదర్శన యాత్ర చేయించారన్నారు. కోన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రామరాజుపాలెంలో రైతులకేం అందడం లేదని చెప్పించి వైసీపీ నేతలు అడ్డంగా దొరికిపోయారన్నారు.

రావడం.. రాళ్లేయడమే జగన్ రాజకీయం

● చంద్రబాబు పర్యవేక్షణ వల్లే ప్రాణనష్టం జరగకుండా కాపాడాం
● పనిచేసే ప్రభుత్వంపై నిందలు వేస్తామంటే ప్రజలు సహించరు
● మంత్రి కొల్లు రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తుపాను వచ్చిన 10 రోజుల తరువాత జగన్‌రెడ్డి వచ్చి ప్రభుత్వంపై నిందలు వేయడానికి సిగ్గుండాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. తుపానులో దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పంట పరిశీలన నెపంతో వచ్చిన జగన్‌రెడ్డి బలప్రదర్శన చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. జగన్ రెడ్డి వచ్చి అబద్ధాలు మాట్లాడుతూ యాత్ర చేశారన్నారు. తుఫాను సమయంలో రైతులు అవస్థలు పడుతుండగా పట్టించుకోకుండా తుఫాను అయిపోయాక నేల ఎండిన తరువాత డబ్బులిచ్చి జనాలను రప్పించుకుని విమర్శిస్తున్నారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గం కోన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గంజాల వెంకటేశ్వరరావు అనే రైతుతో రామరాజుపాలెంలో రైతులకు ఏమీ అందడం లేదని చెప్పించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మచిలీపట్నం రైతుకు పెడనలో సాయం అందలేదని చెప్పించి జగన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయాడని ఎద్దేవా చేశారు. పంటపొలాల్లోకెళ్లి గట్లపై నడుస్తూ సినిమా షూటింగ్‌లా డ్రామాలాడారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూడికలు తీయించిందని, అందువల్లే పంటలను ముంపు నుంచి చాలా వరకు రక్షించగలిగామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల హెక్టార్లలో వరి, 1.83 లక్షల హెక్టార్లలో ఉద్యానపంటలు దెబ్బతిన్నాయన్నారు. 46వేల కిలోమీటర్ల రోడ్డు పాడయిందన్నారు. దాదాపు రూ.5,600 కోట్ల నష్టం వాటిల్లిందని, కేంద్రానికి నివేదిక పంపించామన్నారు. తుపాను ప్రభావం మొదలైనప్పటి నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు, ప్రజలకు అండగా నిలిచారన్నారు. చంద్రబాబు, లోకేశ్ తుఫాను ప్రభావంతో నాలుగు రోజులు ఆర్‌టీజీఎస్‌లోనే ఉండి పర్యవేక్షించారన్నారు. తీరం దాటిన వెంటనే ఏరియల్ సర్వే చేశారన్నారు. అమలాపురంలో పర్యటించి రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అవనిగడ్డ నియోజకవర్గంలో దెబ్బతిన్న రైతుల పంటలను పరిశీలించారన్నారు. చంద్రబాబు లండన్ వెళ్లారని, లోకేష్ క్రికెట్ మ్యాచ్‌కు వెళ్లారనడానికి జగన్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకే లోకేశ్ క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వెళ్లారన్నారు. జగన్‌రెడ్డిలా షాపింగ్‌లు చేసేందుకు లండన్ వెళ్లలేదన్నారు. చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరికి అవార్డు ఇస్తున్న సందర్భంగా వెళ్లారన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో ఇన్‌పుట్ సబ్సిడీని గాలికొదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇచ్చే రూ.20వేలలో ఇప్పటికి ప్రతి రైతుకు రూ.7వేలు ఇచ్చామన్నారు. మిగిలిన సొమ్ము రెండు విడతల్లో ఇవ్వబోతున్నామన్నారు. కౌలు రైతులను జగన్‌రెడ్డిని రోడ్డునపడేశారని, 99 శాతం ఈ-క్రాప్ చేయించామన్నారు. తుఫానులో 900 వరకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, 24 గంటల్లో విద్యుత్ సరఫరా చేశామన్నారు. మంత్రి కొల్లు రవీంద్రతో పాటు టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు, జనసేన నేతలు గడ్డం రాజు, బత్తిన దాసు, ఇంజనీర్ మురళీకృష్ణ, వెంకటస్వామి, పీవీ ఫణికుమార్, కరెడ్ల సుశీల పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం

● రైతుసంఘాల నేతలకు సివిల్ సప్లై ఎండీ ఢిల్లీరావు హామీ



వినతిపత్రం అందజేస్తున్న శోభనాద్రీశ్వరరావు

కానూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, పంట నష్టపరిహారం కూడా చెల్లిస్తామని ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండీ ఢిల్లీరావు రైతు సంఘాల నేతలకు హామీఇచ్చారు. బుధవారం బందరురోడ్డు కానూరులోని ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండీ ఢిల్లీరావును మాజీ మంత్రి, ఏపీఎస్‌కేఎం కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు, ఏపీ రైతు సంఘాల నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ రైతులకు ఏ కష్టం రాకుండా చేస్తామని, సమస్యలు నెరవేరుస్తామన్నారు. ధాన్యం శాతం 17 శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తామని, భారీ తుఫానుతో పంట నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతుసేవా కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా ఫిర్యాదు చేయవచ్చని, ఎలాంటి గందరగోళం పడకుండా రైతులు నేరుగా రైతుసేవా కేంద్రాల్లో ధాన్యాన్ని అందజేయవచ్చన్నారు. పంట ఈ-క్రాప్ నమోదు ప్రకారం పంట పండిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతు సంఘాల నేతలకు ఢిల్లీరావు హామీఇచ్చారు. రైతుసంఘాల నేతలు కేవీవీ ప్రసాద్, వై కేశవరావు, పీ జమలయ్య, ఎం హరిబాబు, ఎం యలమందారావు, వీరబాబు, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సాధ్యమైనన్ని నిధులు కేటాయిస్తా: ఎమ్మెల్యే బోడె



వృద్ధురాలితో మాట్లాడుతున్న బోడె

కంకిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధ్యమైనంత మేరకు నిధులు కేటాయించి కంకిపాడు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పార్టీ క్యాడర్, పోలీసు మందీ మార్బలం లేకుండా బులెట్‌పై ఒంటరిగా మండల కేంద్రమైన కంకిపాడులో బుధవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. బ్యాంక్ కాలనీ, వాణీనగర్‌లో రోడ్లు, డ్రైన్లు పరిశీలించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండటంతో ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. తన కుమార్తెకు పింఛన్ రావడం లేదంటూ ఓ మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లింది. ప్రజల సమస్యలను నేరుగా విన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ తనకున్న సమయంలో నియోజకర్గంలో సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు కంకిపాడులోనే సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బ్యాంకు కాలనీలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రాధ్యానత క్రమంలో చర్యలు చేపడతానన్నారు. బ్యాంక్ కాలనీ వాసులు, వాణి నగర్‌కు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీకి అనవసరంగా ఓటు వేశాం

గత టీడీపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. రహదారులు అధ్వానంగా మారాయన్నారు. రహదారులు చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యేగా మీరు అనేక అభివృద్ధి పనులు చేపట్టారంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కొనియాడారు. రహదారులు, డ్రైనేజీలు అభివృద్ధి చేయాలంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను స్థానికులు కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 585

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పెదపారుపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.పోతురాజు పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అందిన అర్జీల వివరాలను, వాటి పరిష్కారాలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ బి.శ్రీను నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఏసుపాదం, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు రాజబాబు, ఫణికుమార్‌లతోపాటు మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పోతురాజు

నాణ్యమైన భోజనం అందించాలి

పామర్రు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంతోపాటుగా ఇతర ఆహార పదార్థాలను అందించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహంలో బుధవారం బీసీ వసతి గృహాల అడ్వైజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో బీసీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. బల్లిపర్రులాకుల వద్ద నిర్వహించిన వన మహోత్సంలో కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్‌తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలను నాటారు.

కరాటే పోటీల్లో కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : ఈనెల 2వ తేదీన గుంటుపల్లి రైల్వే స్టేడియంలో జేకే గోజూరియో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14సంవత్సరాల లోపు బాలుర వ్యక్తిగత కుమితె విభాగంలో ఎ.ప్రవీణ్ ద్వితీయ స్థానం, కె.జివితేష్, డి.అభిరామ్, వై.గిరీష్‌లు తృతీయ స్థానాలు సాధించినట్టు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను, కోచ్ ఎస్.వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి. ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి గుడివాడ వారు ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం నూతనంగా క్లబ్ సభ్యులను చేర్చుకున్నారు. మొక్కలను నాటారు. డయాబిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పాడి పశువులకు మినరల్ మిశ్చర్ ప్యాకెట్లు ఒక్కొక్క రైతుకు అందించారు. చిన ఎరుకపాడులో ఐదు పేద విద్యార్థులకు రెండు సైకిళ్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ వివి.పిఎస్.ఆంజనేయులు, జిల్లా గవర్నర్ ఎన్.వి.ఎస్ఎస్.ప్రసాద్, ఏడి.లక్ష్మీనారాయణ, మండల పశువైద్యాధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో బుధవారం అంగలూరు డైట్ కళాశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. డైట్ కళాశాల విద్యార్థులకు 116 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అలానే చిన్నతనంలో వచ్చే కేన్సర్, మధుమేహవ్యాధులపై సీహెచ్ శ్రీనివాసరెడ్డి అవగాహన కల్పించారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ , గుడివాడ లయన్స్ ప్రతినిధులు డి.వేణుస్వామి, పి.సతీష్, కె.శ్రీనివాస్‌లు, వి.వి.పిఆంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



గుడివాడలో దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దీపార్చనలు నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుడివాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉసిరిచెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలను వెలిగించి మహిళలు పూజలు నిర్వహించి, దీపోత్సవం



అష్టలక్ష్మీ ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

చేశారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు పెద్దకాలువ వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. శైవక్షేత్రాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఈవో కందుల వేణుగోపాలరావు ఏర్పాట్లు చేశారు.

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. కొంతమంది దంపతులు అమ్మవారి దేవాలయంలో హోమం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు జరిగాయి.

కూచిపూడి: కార్తీక పౌర్ణమి సందర్భంగా చినముత్తేవి,



కొండాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కూచిపూడి, పెదపూడి, మొవ్వ, అయ్యంకి, నిడుమోలు, కాజ, కోసూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అలంకరణ, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు దీపాలంకరణ కార్యక్రమం చేశారు.

నందివాడ : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని తమిరిశ, కుదరవల్లి, అనుమనపూడి, పొలుకొండ, పుట్టగుంట, జనార్థనపురం గ్రామాలలో శివాలయాల్లో జ్వాలా తోరణం ఏర్పాటు ఘనంగా జరిగాయి. పోలుకొండ శివాలయంలో గంగా పార్వతీ సోమేశ్వరస్వామిని పల్లకీపై గుడి చుట్టూ ప్రదర్శనలు చేస్తూ దేవస్థానం చైర్మన్ గొట్టుముక్కల బోసురాజు ఆధ్వర్యంలో పూజారి పొన్నూరు కృష్ణా నాగరాజు శర్మ జ్వాలా కార్యక్రమం నిర్వహించారు. అనమనపూడి శివాలయంలో అన్నసమారాధన కార్యక్రమంలో సుమారు 1000 మంది పాల్గొన్నారు. బొర్రా సత్య



కూచిపూడి శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నారాయణ, పూర్ణచంద్రరావు, రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

పామర్రు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం పామర్రు శివాలయం భక్తులతో పోటెత్తింది.వేకువజామునే భక్తులు విశేషసంఖ్యలో ఆలయానికి చేరుకుని కుటుంబ సమేతంగా ధ్వజస్తంభంతోపాటు ఆలయప్రాంగణంలో గల ఉసిరి ,జమ్మి, తులసి వృక్షాల వద్ద సామూహిక కార్తీక దీపారాధనలు చేశారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను క్యూలైన్ల ద్వారా దర్శించుకుని అభిషేకాలు, ఇతర పూజాదికాలు జరిపించుకున్నారు.ప్రత్యేక



పామర్రు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పూజల్లో కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు. 2వేల మందికి అన్నదానం ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

పమిడిముక్కల: మంటాడ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. పమిడిముక్కల మండల గ్రామాలు, పరిసర మండలాల గ్రామాలనుంచి భక్తుల తరలివచ్చి సామూహిక వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి సేవలందించారు.



మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



దీపకాంతులతో వేంకటేశ్వరస్వామి ఆలయం

ఘనంగా కోటి దీపోత్సవం

గుడ్లవల్లేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) :డోకిపర్రు భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని కోటి వత్తికా దీపోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పి.వి.కృష్ణారెడ్డి,సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో ఈ కోటి వత్తికా దీపోత్సవాన్ని బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పలువర్ణాల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పి.నాగిరెడ్డిప్రసన్న,నాగేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు శ్రీమత్ గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి , కన్యకాపరమేశ్వరీ పంచాయతక్షేత్రంలో జ్వాలాతోరణాలు వెలిగించారు. వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి రుద్ర సహిత చండీ హవనం , పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అలివేటి మండపంలో పూర్ణాహుతి నిర్వహించారు. మంగినపూడి బీచ్‌కు సముద్ర పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు 300 కేజీల పులిహోర ప్రసాదం బీచ్‌లో వితరణ నిర్వహించామని ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకట విష్ణుమోహనరావు, టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ సెక్రటరీ రామరాజు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వెంకట కృష్ణారావు, కుమారి

లబ్ధిదారుడికి చెక్కు పంపిణీ

పెదపారుపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాములపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులకు మంజూరు చేసిన రుణం చెక్కులను సంఘ చైర్మన్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన నాగదేసి యేసు ప్రేమయ్య రుణానికి దరఖాస్తు చేసుకోగా, ఆయనకు మంజూరైన రూ.33,300 ల చెక్కును సంఘం చైర్మన్ నాగ వెంకట కృష్ణ, సంఘ సీఈవో కుమారి బుధవారం అందజేశారు.

పరంధామయ్యకు రావి పరామర్శ

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, టీడీపీ నాయకుడైన సూరపనేని పరంధామయ్య సతీమణి నిర్మల ఇటీవల మృతి చెందగా రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు బుధవారం పరంధామయ్యను పరామర్శించారు. నిర్మల చిత్ర పటానికి పూల మాల వేసి రావి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. అలానే గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమెరికా నుంచి వీడియో కాల్ ద్వారా పరంధామయ్యను పరామర్శించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సైతం పరందామయ్యను ఫోన్‌ద్వారా పరామర్శించారు. మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, జంగం మోహనరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

పెదపారుపూడి : పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించటంతోపాటు ఎస్సై, సిబ్బందితో స్టేషన్ స్థితిగతుల గూర్చి చర్చించారు. తన పరిశీలనలో స్టేషన్ పనితీరు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, ట్రైనింగ్ ఎస్సై విజయభాస్కర్, ఏఎస్సై పి.ప్రకాశరావు, రైటర్ జి.నాగమల్లేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ వరిసాగు ఆదర్శం

తోట్లవల్లూరు : వరిసాగులో రైతు వేములపల్లి రామకృష్ణ చేసిన ప్రయోగాలు ఆదర్శనీయమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పెనమకూరులో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది వ్యవసాయ విస్తరణ కార్యక్రమాన్ని రైతు రామకృష్ణ వరిపొలాల వద్ద నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏ కె శ్రీనివాసరావు, పామర్రు ఏడీఏ బి స్వర్ణలత, జి శ్రీదేవి, ఏవో పద్మజ రామకృష్ణ సాగు చేసిన 15 రకాల వరి పొలాలను సందర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివ మధుబాబు, కావ్య పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హిందూదేవాలయాల అభివృద్ధే కూటమి ధ్యేయమని, పాలక మండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న వీరాంజనేయ దేవస్థానానికి నూతనంగా నియమితులైన పాలకమండలి పదవీ ప్రమాణ స్వీకారానికి బుధవారం ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే హాజరయ్యారు. దేవస్థానం చైర్మన్‌గా తాడిశెట్టి వెంకటేశ్వరరావుతోపాటు మరో11 మంది సభ్యులచేత ఎమ్మెల్యే సమక్షంలో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ హిందూ దేవాలయాలు, సనాతన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నూతన పాల



వీరాంజనేయ దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కవర్గాన్ని కూటమిశ్రేణులు పూలమాలలు వేసి దుశ్శాలువాతో సత్కారించారు. కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఏఎంసీ చైర్మన్ జన్ను శోభనబాబు, మాజీ ఏఎంసి చైర్మన్ మండపాక శంకర్ బాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాస్, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, బీజేపీ కన్వీనర్ యార్లగడ్డ రమేష్, టీడీపీ నేతలు మట్టా వెంకటేశ్వరరావు, ఆలయ అధికారులు సుధాకర్ పాల్గొన్నారు.

ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవాలు డిసెంబరు 16 నుంచి

గుడివాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలను డిసెంబరు 16,17,18 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు కళాశాల కమిటీ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వజ్రోత్సవ వేడుకల్లో రైతులను గౌరవించేందుకు వేడుకల మొదటి రోజు 16వ తేదీ రోజంతా రైతు సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో ఆచార్య రంగా యూనివర్శిటీ నిపుణులు, అనేక రైతు అనుబంధ సంస్థల ప్రతినిధులు పాల్గొని నూతన విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. 17వ రోజుపూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నామన్నారు. 18వతేదీన నిర్వహించే వజ్రోత్సవ ప్రధాన వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల కమిటీ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు

ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి కిరణ్, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కె.వి చౌదరి, అక్కినేని నాగేశ్వరరావు కుమారుడు, సినీహీరో అక్కినేని నాగార్జున, ఇతర కుటుంబసభ్యులు పాల్గొంటారని తెలిపారు. డైమండ్ జూబ్లీ వేడుకల కమిటీ చైర్మన్ కొల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పర్వతనేని కృష్ణప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

●ఎంఈవో -1 రజనీ

గుడివాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎంఈవో -1 రజనీ పేర్కొన్నారు. బుధవారం ఎస్‌పీఎస్ మోటూరు తదితర పాఠశాలల్లోని తరగతి గదులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ త్వరలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు తరగతి గదులు ఏ విధంగా ఉన్నాయి, గాలి, వెలుతురు ఉందా? లేదా అని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మేనేజ్‌మెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. గుడివాడ రూరల్, అర్బన్‌లో 15 సెంటర్లను పదవ తరగతి పరీక్షలకు ఏర్పాటు చేశామన్నారు. 3 వేల మందికిపైగా విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. టాయిలెట్లను పరిశీలించి , పాడైన వాటికి మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతీ విద్యార్థి ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో -1 రజనీ

యలమర్రు ఉపసర్పంచ్‌కు మాతృవియోగం

పెదపారుపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యలమర్రు ఉపసర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ మాతృమూర్తి రాజ్యలక్ష్మి (80) బుధవారం ఉదయం మృతి చెందారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రాజ్యలక్ష్మి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, అట్లూరి రామబ్రహ్మం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకర బుచ్చిబాబు, చెరుకూరి రమేష్ చౌదరి, మధు, చిలకా ఆంజనేయులు, కలపాల కిషోర్, కాటమరాజు, చిలకా ధనరాజు, నాగదే సి సునీత, నత్తవాణి, గోగం రామారావు, బుడ్డాలు, బాబి, ఇలపర్రు పండు, నాగదేసి కళ్యాణి, నాగదేసి జై రాజు, పునుకొల్లు బెనర్జి, మల్లిఖార్జునరావు, కూచిపూడి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, అడుసుమిల్లి శ్రీనివాసరావు, మృతదేహానికి నివాళులర్పించారు.



రాజ్యలక్ష్మీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పమిడిముక్కల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. చోరగుడి నుంచి గోపాల కృష్ణాపురం మీదుగా గూడపాడు రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోపోవడంతో అధ్వానంగా తయారయ్యాయన్నారు. నిధుల లభ్యతను బట్టి రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, కూటమి నాయకులు సుబ్రమణ్యేశ్వరరావు, శ్రీనివాసరావు, లింగమనేని బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-14,17 ఖో-ఖో, వాలీబాల్ జట్ల ఎంపిక

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపిక నిర్వహించారు. అండర్-14,17 బాలుర,బాలికల ఖో-ఖో, అండర్-14 బాలుర,బాలికల వాలీబాల్ జట్లఎంపిక పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులతో జిల్లా జట్లను సిద్ధం చేశారు. జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ అంతా జిల్లా వ్యాయామోపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ పోటీలకు డివిజన్‌లోని వివిధ పాఠశాలల నుండి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు త్వరలో జరుగబోవు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల డివిజన్ కన్వీనర్ యార్లగడ్డ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఆర్ఎస్‌కేల్లో పంట నష్టం జాబితా ప్రదర్శన

గుడ్లవల్లేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా గుడ్లవల్లేరులో దెబ్బతిన్న వరిచేల జాబితాను రైతు సేవాకేంద్రంలో ప్రదర్శించారు. మండలంలోని 16 రైతు సేవా కేంద్రాలో ఈ జాబితాలు ఉంచామని మండల వ్యవసాయాధికారి లోయ సునీల్ తెలిపారు. ప్రచురించిన పంట నష్టం జాబితాపై అభ్యంతరాలు ఉంటే వాటిని గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేయాలని రైతులకు ఆయన విజ్ఞప్తిచేశారు. గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అభ్యంతరాలను సరిచేయించుకోవాలన్నారు. గుడ్లవల్లేరు రైతు సేవా కేంద్రంలో గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వరరావు సమక్షంలో జాబితాను ప్రచురించారు.



గుడ్లవల్లేరు రైతు సేవా కేంద్రంలో జాబితా ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారి సునీల్

గుడివాడ రూరల్: గుడివాడ మండలంలో 834 మంది రైతులకు పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. బుధవారం ఏవో కార్యాలయంలో పంట నష్టం అంచనా లిస్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1075 ఎకరాలు పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. రూ.1,07,05,000 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టాల వివరాలు గ్రామాల వారీగా సచివాలయాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రైతుకు పేర్లు తెలియజేశామని చెప్పారు. ఆర్ఎస్‌కే సెంటర్లలో ఈ వివరాలు ఉంచామని తెలిపారు.



గుడివాడ రూరల్ రైతు సేవా కేంద్రంలో జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో అనంతలక్ష్మీ

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలకు బాలబాలికల ఎంపిక

నందివాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు ఈ నెల 7, 8, 9 తేదీల్లో కర్నూలు జిల్లాఓల జరిగే 32వ కబడ్డీ పోటీలకు బుధవారం మండలంలోని వెన్ననపూడి జిల్లా పరిషత్ పాఠశాలలోస్పొర్ట్స్ అథార్టీ ఆంధ్రప్రదేశ్ కోచ్ కళ్యాణి అంగలూరు పిడి ఎస్.సంధ్యారాణి, గరికిపాడు పిడి సిహెచ్.భవాని బాలికలను ఎంపిక చేశారు.బాలుర విభాగంలో కృష్ణా జిల్లా కబడ్డీ సెలక్షన్స్ అధ్యక్షుడు కెవి.నాంచారయ్య, కార్యదర్శి పి.రవీంద్ర బాబు, కబడ్డీ ప్లేయర్స్‌ను ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వై.మాధవ్ కుమార్ తెలిపారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవ్ కుమార్ కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి ఆటలను ప్రారంభించారు. పాఠశాల పిడిలు ఏ.రామారావు, కెకె.చందు, సిహెచ్.భవాని, ఎస్.సంధ్యారాణి, కె.సుకన్య పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 585

సుబ్బారాయుడి సేవలో 6వ అదనపు జిల్లా జడ్జి

మోపిదేవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని అవనిగడ్డ న్యాయస్థానం ఆరవ అదనపు జిల్లా జడ్జి పాండురంగారెడ్డి బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో ఆయనను సత్కరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆయనకు ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు అందించారు.


జడ్జి పాండురంగారెడ్డికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఈవో శ్రీరామ వరప్రసాదరావు


ప్రత్యేక అలంకరణలో బచ్చుపేట శివాలయంలో స్వామి


వేకనూరులో కాశీవిశ్వేశ్వరుడు


నాగాయలంకలో కృష్ణానది ఒడ్డున కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఘంటసాలలో జలధీశ్వరస్వామి


పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం

శివోహం

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

మచిలీపట్నం టౌన్/పెడన/పెడన రూరల్/ చల్లపల్లి/ అవనిగడ్డ రూరల్/నాగాయలంక/ ఘంటసాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మచిలీపట్నం బచ్చుపేట శివాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం, గాంధీబొమ్మ శివాలయం, కొజ్జిలిపేట నాగేశ్వరస్వామి దేవాలయం, గొడుగుపేట శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జ్వాలాతోరణాలు వెలిగించారు. చల్లపల్లిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, నడకుదురు పృధ్వీశ్వరస్వామి ఆలయం, పాగోలు పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నడకుదురు పృధ్వీశ్వరక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయ లక్ష్మి దంపతులు, ఆలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర - రమ ణకుమారి దంపతులు జ్వాలాతోరణ కార్యక్రమంలో పూజలు చేశారు. ఘంటసాల బాలపార్వతీ సమేత జలదీశ్వరస్వామి దేవాలయం, ఘంటసాలపాలెంలో ఉన్న ఉమామధురేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని ఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెడన గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణోత్సవం వైభవంగా నిర్వహించారు. పాతపేటలోని ముత్యాలమ్మ (ఘటం గుడి) ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కోటి వత్తులతో దీపాలను వెలిగించారు. వేకనూరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశా రు. చెన్నూరులో గంగాపార్వతీ సమేత నారద లింగేశ్వర స్వామి, కమలాపురంలో నాగేశ్వరస్వామి, మడకలో భోగలింగేశ్వరస్వామి, ఉరివిలో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి, చోడవరంలో అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, బల్లిపర్రు, నంది గం, చేవేంద్ర, పుల్లపాడు, నడుపూరు, లంకలకలవగుంట, అగ్రహారం శివాలయాలు, వైష్ణవ దేవాలయాల్లో వేకువ జాము నుంచే భక్తులు పూజలు చేశారు. రాత్రికి దీపాలు వెలిగించారు.


నడకుదురు పృధ్వీశ్వర క్షేత్రంలో కోటిదీపోత్సవంలో వత్తులు వెలిగిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచవరం గ్రామంలో జరిగింది. ఎస్సై చాణక్య తెలిపిన వివరాల ప్రకారం..'గ్రామానికి చెందిన బలుసుపల్లి స్వరూపారాణి(39) మంగళవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ ఇంట్లో నుంచి బయటకు రాకపోవటంతో చుట్టుపక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు తెలిపారు. వారు అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం తరలిస్తుండగా మార్గం మధ్యలో స్వరూపారాణి మృతి చెందింది.' మృతురాలికి కుమారుడు నాగఫణీంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బుధవారం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.


గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతును రాజు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాలని ఆయన సూచించారు. డీసీ ఛైర్మన్ పోతన స్వామి, తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, ఏవో గుమ్మడి శివరామకృష్ణ, దాసరి ఉమాసాయిరామ్, కోలపల్లి రజని, కొరియర్ శ్రీను, ఎస్‌ఏ బేగ్, పోతన రామోజీ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి పదవులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు వస్తాయనడానికి పీవీ ఫణికుమార్ నిదర్శమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఫణికుమార్‌కు బుధవారం ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి కొల్లు రవీంద్ర నియామక ఉత్తర్వులను అందజేశారు. మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య)లను పీవీ ఫణికుమార్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కుంచేనాని, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకుడు గడ్డం రాజు, బ్రాహ్మణ సంఘ నాయకుడు డాక్టర్ బృందావనం ధన్వంతరీ ఆచార్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చోడవరపు లక్ష్మీ ప్రసూన, న్యాయవాది సర్వా లలితకుమారి, వేమూరి పవన్‌కుమార్ శర్మ, లొల్ల కుటుంబ శాస్త్రి, తంగిరాల మిథున వ్యాస్, భవిష్య, కాళీ పట్నపు రఘు, నిమ్మగడ్డ శ్రీధర్ తదితరులు సత్కరించారు. వేద పండితులు వేదమంత్రాలతో మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల జగన్నాథరావును ఆశీర్వదించారు. బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, బీజేపీ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీరావు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలకు ఫణికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల బుల్లయ్యను గజమాలతో సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

ఇత్తడి దీపపు కుందులు, గంట బహూకరణ

చల్లపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నడకుదురులోని పృధ్వీశ్వరస్వామి దేవస్థానానికి చెన్నయ్‌కు చెందిన యార్లగడ్డ విజయకుమారి-శివరామప్రసాద్ దంపతులు రూ.75వేల విలువైన భారీ కంచు గంట, రెండు ఇత్తడి నిలువెత్తు దీపపు కుందులను బహూకరించారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి పృధ్వీ కల్యాణ్ పూజలు చేసి ఆలయంలో అలంకరించారు. ఆలయ సమగ్ర అభివృద్ధి దాత మండవ రవీంద్ర- రమణకుమారి దంపతులు పాల్గొన్నారు.


పృధ్వీశ్వరస్వామి దేవస్థానానికి దీపపు కుందులు, గంట బహూకరిస్తున్న యార్లగడ్డ విజయకుమారి

బంటుమిల్లి ఏజీపీగా అంగర రమాదేవి

బంటుమిల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా అంగర రమాదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామానికి చెందిన న్యాయవాది అంగర రంగనాథ్ సోదరి రమాదేవి ఏజీపీగా నియమితులవడంపై బార్ అసోసియేషన్ సభ్యులు, గ్రామప్రముఖులు అభినందనలు తెలిపారు.



అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చేయూతనందించింది. పిట్టల్లంక గ్రామానికి చెందిన కైలా శరత్‌బాబు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం పూర్తిగా దగ్ధమైంది. బుధవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల శాఖ ఆధ్వర్యంలో వంట సామగ్రి కిట్టు, టార్పాలిన్, 25 కేజీల బియ్యం, కూరగాయలు అందించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, కొండవీటి సురేష్, జొన్నా రవిశంకర్, పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, బండేవారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు మర్రె గంగయ్య పాల్గొన్నారు.

మినుము సాగుపై అవగాహన

ఘంటసాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మినుము సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించారు. మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకుని తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని సుధారాణి సూచించారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంబించి, అవశేషరహిత పంట ఉత్పత్తులు పొందాలని సూచించారు. మినుములో మేలైన సస్యపోషణ చర్యలపై శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి, సస్యరక్షణ చర్యలపై డాక్టర్ డి.రేవతి వివరించారు.

ఎస్టీపీల నిర్మాణం కోసం స్థల పరిశీలన

పెడన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి పట్టణంలోని మూడు ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీలు) సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్నారు. అందుకు అనువైన స్థలాలను గుర్తించేందుకు హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు బుధవారం పట్టణంలో పర్యటించారు. అందు బాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, అక్కడ ఉన్న డ్రెయినేజీలను వారు పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్ర పోటీలకు షేక్ సల్మా

అవనిగడ్డ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో ఈ నెల 4వ తేదీన జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జూనియర్ విభాగం 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి ఈ నెల 7, 8 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అవనిగడ్డ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని షేక్ సల్మా ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మత్తి నాగమల్లేశ్వరరావు తెలిపారు. సల్మా, పీడీ ఉదయ్‌కుమార్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించింది.


షేక్ సల్మాను అభినందిస్తున్న హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

మోపిదేవి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బాలారుద్ర కాశీ ఓలేటమ్మ, మామిళ్లమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుట్టా మోహన శివరాజయ్య, ఆలయ ఛైర్మన్ దుట్టా శ్రీవాణి ఆధ్వర్యంలో 50 మంది ముత్తైదువులు పాల్గొన్నారు. అర్చకుడు ఫణి శర్మ ఆధ్వర్యంలో నిత్య రుద్రాభిషేకం, వ్రతాలు జరిపారు.

ఈ-క్రాప్ నమోదు

నాగాయలంక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 16 వేల ఎకరాల్లో సాగవుతున్న వరి పంటకు ఈ -క్రాప్ నమోదు చేసినట్లు ఏవో ఎ.సంజీవ్ కుమార్ తెలిపారు. పొలం వద్ద యజమానిని నిలబెట్టి ఈ- క్రాప్ నమోదు చేసి జిల్లా అధికారులకు పంపామని పేర్కొన్నారు.

తుఫాన్ బాధిత కుటుంబానికి సాయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా చెట్లు విరిగి ఇంటి పైకప్పు దెబ్బతిన్న మేకావానిపాలేనికి చెందిన నిరుపేద కుటుంబానికి బుధవారం ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం సాయం అందించింది. నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, బియ్యం, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేసింది. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి జి.కిషోర్, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్, డి.వాసు, ఎ.శ్రీనివాసరావు, మల్లికార్జున ప్రసాద్, వాలిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు.

శ్యామలాంబ ఆలయానికి వెండి కంఠాభరణం, హారం బహూకరణ

పెడన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ ఆలయానికి కొత్తపేటకు చెందిన కారుపర్తి కోట శ్యామల విఘ్నేశ్వరరావు, మాధవీలత దంపతుల కుమార్తె డాక్టర్ ఐశ్వర్య బుధవారం వెండి కంఠాభరణం, హారం బహూకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బొడ్డు దీక్షానందుడు, అగస్త్యేశ్వర స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ బళ్ల ప్రసాద్, కర్నా మోహనరావు, వీణం శ్రీనివాస్, భట్టు శంకరరావు, భార్గవ్ పాల్గొన్నారు.


వెండి కంఠాభరణం, హారాన్ని ఆలయ కమిటీ ఛైర్మన్ దీక్షానందుడుకు అందజేస్తున్న ఐశ్వర్య